సాక్షి రంగారెడ్డి

శనివారం । 1 । మార్చి । 2025



విస్మరించిన కేంద్రం

కేంద్ర బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిందని సంఘం జాతీయ కార్యదర్శి బాలకృష్ణ విమర్శించారు. 8లో ▸



అందరికీ అందుబాటులో..

న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కి వచ్చే వారందరికీ అందుబాటులో ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. 8లో ▸



పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్మీడియెట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తెలిపారు. 8లో ▸

లక్ష్యం.. స్వచ్ఛం

మున్సిపాలిటీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు

- పట్టణ ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ
- పనితీరు మేరకు మార్కుల కేటాయింపు
- ఏప్రిల్‌లో ర్యాంకుల జాబితా ప్రకటించనున్న కేంద్రం



షాద్‌నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో అభిప్రాయాలు సేకరిస్తున్న మెప్మా సిబ్బంది (ఫైల్)

షాద్‌నగర్: పట్టణాల్లో సంపూర్ణ స్వచ్ఛత సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. స్వచ్ఛమైన పట్టణాలను నిర్మించి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ‘ఒక్క అడుగు స్వచ్ఛత వైపు’ నినాదంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. గతంలో నిర్వహించిన మాదిరిగానే ఈసారి కూడా స్వచ్ఛత పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని మూడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల్లో అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. వచ్చే నెల 31 వరకు అభిప్రాయాలు సేకరించనున్నారు.

టూల్‌కిట్ విడుదల

కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర పురపాలక శాఖ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఇటీవల స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించిన టూల్‌కిట్‌ను విడుదల చేశారు. దీని ఆధారంగా సర్వే చేపట్టనున్నారు. మున్సిపాలిటీల్లో పరిశుభ్రత ప్రమాణాలు తనిఖీ చేసి ర్యాంకులు నిర్ధారించనున్నారు. ప్రజల అభిప్రాయం, నిబంధనల మేరకు సర్వీస్ లెవల్ కార్యక్రమాల అమలు, సర్టిఫికేషన్ వంటి విభాగాల్లో సాధించిన ప్రమాణాలను అనుసరించి మార్కులు కేటాయిస్తారు.

సర్వే కోసం యాప్

సర్వే నిర్వహించేందుకు వీలుగా యాప్‌ను ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సర్వేకు సంబంధించిన ఫారం, ఓటీపీ వస్తుంది. ఆయా మున్సిపాలిటీల్లో స్వచ్ఛత సాధించడంలో పురోగతిపై పది ప్రశ్నలు ఉంటాయి. వాటిలో ఒక దానిని ఎంచుకొని ఓటీపీ జత చేసి పంపాల్సి ఉంటుంది. మెప్మా సిబ్బంది పట్టణాల్లో తిరుగుతూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

మార్కుల కేటాయింపు ఇలా..

మొత్తం మార్కులు	–	12,500
ఓడీఎఫ్, తాగునీరు	–	1,200
గార్బేజ్ ఫ్రీ సిటీ	–	1,300
మిగిలిన అంశాలకు	–	10,000

ఫలితాలను బట్టి మార్కులు

ప్రధానంగా మున్సిపాలిటీల్లో తడి, పొడి చెత్తను విడిగా సేకరించడం.. యంత్రాల నిర్వహణ.. డంపు యార్డులు.. మానవ వ్యర్థాల నిర్వహణ.. జియోట్యాగింగ్.. పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ.. నిషేధిత ప్లాస్టిక్ వాడకం జరగకుండా చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటి ఫలితాలను బట్టి మార్కులు కేటాయిస్తారు. వీటితోపాటు యాప్ ద్వారా అడిగే ప్రశ్నలకు సైతం మార్కులు ఉంటాయి.

సర్వే కొనసాగుతోంది



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వివిధ రకాల సేవలపై సర్వే కొనసాగుతోంది. సిబ్బంది ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నాం. ఈసారి మంచి మార్కులు సాధిస్తామన్న నమ్మకం ఉంది.

– సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

రానున్న కేంద్రం బృందం

కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పట్టణాల్లో పర్యటించనుంది. ఏప్రిల్‌లో కేంద్రం ర్యాంకుల జాబితాను ప్రకటించనుంది.

ఇవీ ప్రశ్నలు..

- ప్రతి రోజు చెత్త సేకరించేందుకు మీ ఇంటికి లేదా దుకాణానికి వస్తారా?
- మీ ప్రాంతాన్ని రోజూ ఊడుస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్నారా?
- మీ ప్రాంతానికి సమీపంలో చెత్త కుప్పలు పేరుకపోవడంలాంటివి తరచూ కనిపిస్తాయా?
- ఇంట్లోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి ఇస్తున్నారా?
- స్వచ్ఛ ఆటోల వారు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తారా లేదా కలిపి తీసుకెళ్తారా?
- మార్కెట్లు, బజార్లు, పార్కులు, ఉద్యానవనాలు, ఇతర ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతను నిర్వహించడంలో స్థానిక అధికారులు ఎంత ప్రభావవంతంగా ఉన్నారని మీరు అనుకుంటున్నారు?
- మీ నగరంలో చెత్త వ్యర్థాలను మేనేజ్ చేయడం కోసం ఉన్న రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్స్ గురించి మీకు తెలుసా?
- మురుగు కాల్వలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయడానికి లైసెన్స్ పొందిన ఆపరేటర్స్‌ని మాత్రమే నియమించుకోవాలని మీకు తెలుసా?
- మీ ప్రాంతంలోని పబ్లిక్ టాయిలెట్స్ యొక్క శుభ్రత, వాటి నిర్వహణపై మీరు ఎంత వరకు సంతృప్తి చెందారు?
- మీరు ఎప్పుడైనా పరిశుభ్రతకు సంబంధించిన సమస్యను స్థానిక అధికారులకు రిపోర్ట్ చేశారా.. దాన్నివారు ఏవిధంగా పరిష్కరించారు?

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూమి సర్వే



ప్రభుత్వ భూమిని సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామం సర్వే నంబర్ 53లో డంపింగ్ యార్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. డంపింగ్ యార్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని పట్టాభూమిలో కలుపుకొనేందుకు యజమాని హద్దురాళ్లు పాతాడు. ‘ఆక్రమణల పర్వం’ శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు సదరు భూమిలో సర్వే చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌ఐ నివేదిత, మండల సర్వేయర్ వెంకటేశ్ యాదవ్ ప్రభుత్వ భూమిని సర్వే చేసి కబ్జాలో ఉన్న 2.27 ఎకరాల భూమిని కాపాడారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అజాంఅలీ హెచ్చరించారు. గుర్తించిన ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్టు చెప్పారు.

పులందరి వాగుకు హద్దులు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఎంపీ పటేల్‌గూడలో ఉన్న పులందరి వాగుకు శుక్రవారం హద్దురాళ్లు పాతారు. ‘పూడ్చేస్తాం.. ఆక్రమిస్తాం’ శీర్షికన గత నెల 18న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో తాజాగా హద్దురాళ్లు పాతి, వాగులో పోసిన మట్టిని తొలగించారు.

కొలతల ప్రకారం యూనిఫాం కుట్టాలి



స్వయం సహాయక గ్రూపు మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

కందుకూరు: విద్యార్థుల యూనిఫాం కొలతల ప్రకారం, నాణ్యతతో కుట్టాలని డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశించారు. మండల పరిధిలోని పులిమామిడిలో శుక్రవారం సెర్ప్ అధికారులు, ఐకేపీ సిబ్బందితో పాటు స్వయం సహాయక గ్రూపుల మహిళలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది కుట్టిన యూనిఫాం విషయమై ఫిర్యాదులు వచ్చాయని, ఈ దఫా ముందుగానే ప్రతి విద్యార్థి కొలతలు తీసుకుని పాఠశాలలు తిరిగి పునఃప్రారంభమయ్యేలోపు అందించేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆమె హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులతో యూనిఫాం విషయమై చర్చించారు. అంతకుముందు గ్రామ పంచాయతీ నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ సరిత, ఏపీఎం కవిత, పీఏఓ రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, టీఏ బాల్ రెడ్డి, ఐకేపీ సీసీలు, ఏఫ్‌ఏలు ఉన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

మహేశ్వరం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఉద్యాన పంటలను రైతులు సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్ సూచించారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో రైతులు సాగు చేసిన పూలు, ఆయిల్ పామ్ పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేసేవారికి సబ్సిడీ అందించి ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ సాగులో చీడపీడల బెడద ఉండదని, కూలీల ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న మహేశ్వరం, కందుకూరు మండలాల్లో కూరగాయలు, పండ్లు, పూలు, తోటల పెంపకం చేపట్టి అధిక లాభాలు ఆర్జించాలన్నారు. అంతకు ముందు రైతులకు ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి సౌమ్య పాల్గొన్నారు



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న జాగిలాలు

విన్యాసాలు అదుర్స్

మొయినాబాద్: స్థానిక ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న 72 జాగిలాల 24వ బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాగిలం హ్యాండిలర్ (యజమాని) చెప్పినట్లుగా నమస్కారం చేయడం.. జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించడం.. యజమాని పడుకోమని చెబితే పడుకోవడం.. దొర్లమని చెబితే దొర్లడం.. మంటల్లో నుంచి దూకడం.. యజమాని వస్తువు పడిపోతే వెతికి పట్టుకురావడం.. న్యూస్ పేపర్, ఇతర వస్తువులు తెచ్చివ్వడం.. కదిలే వాహనాలపై యజమాని చెప్పినట్లు గౌరవ వందనం చేయడం.. మందు పాత్రలను గుర్తించడం.. శత్రువులపై దాడి చేసి పట్టుకోవడం వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ఇంటెలిజెన్స్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



మంటల్లో నుంచి దూకుతూ..



రెండు కాళ్లతో మంకీ వాక్ చేస్తూ..

చేవెళ్లలో జిల్లా అదనపు సెషన్స్‌కోర్టు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు

చేవెళ్ల: జిల్లా అదనపు సెషన్స్ కోర్టును చేవెళ్ల మండల కేంద్రంలో శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజేయ్‌పాల్, సామ్‌కోసి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ప్రదీప్‌నాయక్ నేరుగా శిలాఫలకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో చేవెళ్ల సీనియర్ సివిల్‌కోర్టు జడ్జి దశరథ రామయ్య, సీనియర్ న్యాయవాదులు పి.రాంరెడ్డి, రేసు మహేందర్‌రెడ్డి, అనంత్‌సేన్‌రెడ్డి, చేవెళ్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సత్యానందం, ప్రభుత్వ ప్లీడర్ బి.యాదిరెడ్డి, పలువురు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సునీలం

ఐక్యంగా భూములను కాపాడుకోవాలి

మధ్యప్రదేశ్ కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునీలం

యాచారం: రైతులు ఐక్యంగా ఉండి తమ వ్యవసాయ భూములను కాపాడుకోవాలని మధ్యప్రదేశ్ కిసాన్ సంఘర్ష సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సునీలం అన్నారు. మండల పరిధిలోని తాడిపర్తిలో శుక్రవారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ‘భూసేకరణ చట్టాలు, భూములను ఎలా కాపాడుకోవాలి, రైతుల సాదక బాధకాలపై’ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఐకమత్యంతో ఉంటే ఏ చట్టాలూ ఏమీ చేయలేవన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ కొత్త నల్లా చట్టాలను రద్దు చేసే వరకు నెలల కొద్దీ ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల అంగీకారం లేనిదే ఏ సర్కార్‌కు కూడా ఎకరా భూమిని తీసుకునే అధికారం లేదని స్పష్టం చేశారు. 2013 భూసేకరణ చట్టం, రైతులకు కల్పించిన హక్కులు, రాజ్యాంగం మనకిచ్చిన హక్కులను తెలుసుకోవాలని సూచించారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు మాట్లాడుతూ.. ఫార్మాసిటీతో ఎలాంటి ముప్పు ఉంటుందో తెలియజేశారు. సమావేశంలో హైకోర్టు లాయర్ శ్రీకాంత్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవులు సరస్వతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబ శివరావు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు

తుర్కయంజాల్: పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివ రావు అన్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి బ్రాహ్మణపల్లిలో శుక్రవారం నిర్వహించిన పార్టీ శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో చొక్కాలు మార్చినట్లు పార్టీలు మార్చే వారు కమ్యూనిస్టు పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పొత్తులు శాశ్వతం కాదని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, నాయకులు రవీంద్రచారి, కొంతం మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో స్టార్టప్‌లు కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

- వచ్చే పదేళ్లలో ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ఆలోచన, పెట్టుబడే కాదు మానసిక దృఢత్వమూ ముఖ్యమే..
- స్వయంసమృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు
- పలువురు వక్తల అభిప్రాయం
- కన్హా శాంతివనంలో స్టార్టప్ ఫోరం- 2025



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దేశాభివృద్ధిలో స్టార్టప్ (అంకుర)లదే కీలక పాత్ర అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. యూనికాన్ సంస్థల ద్వారా పెట్టుబడి పెట్టిన వాళ్ల స్వయం సమృద్ధి సాధించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని ప్రకటించారు. ముఖ్యంగా ఫార్మా, హెల్త్‌కేర్, ఐటీ రంగాల్లో స్టార్టప్‌లదే కీలకమని అన్నారు. నందిగామ మండలం కన్హాశాంతివనంలో శుక్రవారం నిర్వహించిన ‘స్టార్టప్ ఫోరం- 2025’లో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది అంకుర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వచ్చే పదేళ్లలో ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సృష్టించమే లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందని, ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంస్థ స్థాపన ఒక్కటే లక్ష్యం కాదన్నారు. పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, తక్కువ ఖర్చుకే మౌలిక సదుపాయాలు సమకూర్చుకుని సంస్థను ఆర్థికంగా నిలబెట్టడం పెద్ద సవాలుగా మారిందన్నారు. ఈ సమయంలో కంపెనీ వ్యవస్థాపకులు అనేక ఒత్తిళ్లకు లోనవుతుంటారని, ధ్యానం, యోగా ద్వారా వీటిని అధిగమించొచ్చని సూచించారు. ఇందుకు కన్హాశాంతి వనం గొప్ప వేదిక అని కొనియాడారు. పలు సంస్థల ప్రతినిధులు ఆర్తిగుప్తా, మల్లికారెడ్డి, శ్రీకాంత్ అయ్యర్, శివకుమార్‌గణేషన్, సతీష్ ఆంధ్ర, వాణికోల తదితరులు తమ అనుభవాలను యువ స్టార్టప్‌లతో పంచుకున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే టాలెంట్ ఒక్కటే సరిపోదు. అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అన్నింటినీ తట్టుకుని ముందుకు సాగాలంటే ముందు మానసికంగా ధృడంగా తయారు కావాల్సి ఉంటుంది. ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది.

– ప్రజ్ఞామిశ్ర, పబ్లిక్ పాలసీ అండ్ పార్టనర్‌షిప్

సవాళ్లను తట్టుకుని నిలబడాలి

స్ఫూర్తిదాయకమైన వ్యాపారవేత్తల తరాన్ని మనం తయారు చేయాలి. భారత్ కేవలం స్టార్టప్ వ్యవస్థాపకులను ఉత్పత్తి చేసే దేశమే కాదు సవాళ్లను సమర్థవంతంగా తట్టుకుని నిలబడే నాయకత్వం, సామాజిక స్పృహ ఉన్న వాళ్లను తయారు చేసే వ్యవస్థగా గుర్తింపు తేవాలి. ధ్యానం అంతర్గత సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

– దాజీ, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు

అంకురాలకు పెద్దపీట



అంకుర సంస్థలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఐటీ పెట్టుబడులకు సైబరాబాద్ కేంద్రంగా మారింది. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 16 ఫార్మా కంపెనీలకు ఫార్మా క్లస్టర్లలో భూములు కేటాయించాం. సెప్టెంబర్‌లో స్కిల్ యూనివర్సిటీ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

– జయేశ్‌రంజన్, ముఖ్యకార్యదర్శి, ఐటీ, పరిశ్రమలశాఖ

ఆరోగ్యం కూడా ముఖ్యమే



భవిష్యత్తులో కృత్రిమ మేధ (ఏఐ)తో పోటీపడాల్సి రావొచ్చు. భయపడి వెనుకడుగు వేయొద్దు. దేశాభివృద్ధి అంటే ఆర్థికాభివృద్ధి సాధించడం మాత్రమే కాదు. ఆరోగ్యం, మానసిక ప్రశాంత కూడా ముఖ్యం. జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలి. రెండింటికీ సమప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఆశించిన లక్ష్యాన్ని అధిగమించగలం.

– శ్రీనిరాజు చింతలపాటి, చైర్మన్, ఐల్యాబ్స్

ఓర్పు, నేర్పు కావాలి



యూనికాన్ పొజిషన్‌కు చేరుకోవడం అంత సులభం కాదు. ఓర్పు, నేర్పుతోనే సాధ్యం. సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. మానసిక కుంగుబాటుకు లోనుకాకుండా చూసుకోవాలి. బలమైన అభ్యాసాల ద్వారా మాత్రమే ఎంచుకున్న గమ్యాన్ని చేరుకుంటాం.

– ఫణీంద్రసామ, ఫౌండర్, రెడ్‌బస్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీఆర్‌ఓ సంగీత, ఇతర అధికారులు

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

ఇబ్రహీంపట్నం రూరల్: మార్చి 5వ తేదీ నుంచి జరగబోయే ఇంటర్మీడియెట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం జిల్లా కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంగీత మాట్లాడారు. జిల్లాలో 185 పరీక్షా కేంద్రాల ద్వారా 77,863 మంది మొదటి సంవత్సరం, 69,348 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్నపత్రాల స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామని, సమీపంలోని జీరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపేలా చూస్తామన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, రాచకొండ, సైబరాబాద్ పోలీసులు, పోస్టల్, విద్యుత్, మెడికల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులను విస్మరించిన కేంద్రం

మత్స్యకార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిందని మత్స్యకార్మిక సంఘం జాతీయ కార్యదర్శి ఎల్.బాలకృష్ణ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో శుక్రవారం మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల జీవనస్థితిగతులు ఇప్పటికీ దుర్భరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పాలనలో మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారని ఆరోపించారు. జలవనరుల్లో ఉన్న మత్స్య సంపద ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యం కారణంగా మృత్యువాత పడితే ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మత్స్యకారులకు రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయిని.. బోర్లు వేయించి మత్స్యసంపదను కాపాడాలని కోరారు. మత్స్యసొసైటీల బలోపేతానికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చనమోని శంకర్, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకన్న, సహాయ కార్యదర్శి బి.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ

బైక్‌ను తప్పించబోయి..

- ఆటో బోల్తా
- డ్రైవర్, విద్యార్థులకు గాయాలు

షాద్‌నగర్‌రూరల్: ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్, విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంచందర్ తెలిపిన ప్రకారం.. నందిగామ మండలం చెర్లఅంతిరెడ్డిగూడకు చెందిన పాండు ప్రతీ రోజు తన ఆటోలో వీర్లపల్లిగ్రామానికి విద్యార్థులను పట్టణంలోని రెండు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను తీసుకువస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం డ్రైవర్ పాండు పది మంది విద్యార్థులతో షాద్‌నగర్‌కు బయలుదేరాడు. పట్టణ శివారులోని రెడ్‌రోజ్ గార్డెన్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్, విద్యార్థులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. చికిత్స అనంతరం డ్రైవర్ పాండుతో పాటుగా విద్యార్థులను ఇంటికి పంపించారు. విద్యార్థి తండ్రి చెన్నకృష్ణ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు దీపక్ సింగ్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే పరామర్శ

ఆటో బోల్తా పడిన ఘటనలో గాయపడిన విద్యార్థులను ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకునరి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బీఆర్‌ఎస్ యువనాయకులు మురళీ కృష్ణయాదవ్ క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

భారత రాజ్యాంగం స్థూపం ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేటలో శుక్రవారం రాత్రి భారత రాజ్యాంగం స్థూపాన్ని ఆవిష్కరించారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ సర్పంచులు కమ్లేకర్ నవీన్‌కుమార్, జగదీశ్వర్, బజారయ్య, మాజీ ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, జమాల్‌ఖాన్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు రాకేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పులందరికి చెక్‌డ్యాంకు గండి



పులందరి చెక్‌డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం

ఇబ్రహీంపట్నం రూరల్: చెరువులు, కుంటలను కాపాడాల్సిన ప్రజలే వాటిని ఆగం చేస్తున్నారు. మండుటెండల్లోనూ నీరుండే వందేళ్ల చరిత్ర ఉన్న పులందరి చెక్‌డ్యాంను ధ్వంసం చేస్తున్నారు. దీంతో చెక్‌డ్యాంలో నీరు అడుగంటుతోంది. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి మహమ్మాయి ఆలయం పక్కనన్న పులందరి చెక్‌డ్యాంకు వందేళ్ల చరిత్ర ఉంది. ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా ఈ చెక్‌డ్యాంలో నీరు ఎండిపోయిన చరిత్ర లేదు. కానీ కొందరు అక్రమార్కులు చెక్‌డ్యాంకు జేసీబీలతో గండికొట్టడంతో నిండుకుండలా ఉండే చెక్‌డ్యాం నీరు సగానికిపైగా తగ్గాయి. చెక్‌డ్యాంకు గండికొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళ్‌పల్లి వాసులు డిమాండ్ చేస్తున్నారు.

తప్పుడు పత్రాలతో ఐదెకరాలు రిజిస్ట్రేషన్

నిందితుల్లో ఒకరికి రిమాండ్



సాబేర్ బిన్ మహ్మద్ (ఫైల్)

మహేశ్వరం: తప్పుడు పత్రాలు సృష్టించిన ఇద్దరు వ్యక్తులు ఐదెకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఒకరిని రిమాండ్‌కు తరలించగా అసలు సూత్రధారికి ముందస్తు బెయిల్ ఉండడంతో అరెస్ట్ చేయలేదు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తుమ్మలూరు సర్వే నంబర్ 378లో ఐదెకరాల భూమిని 1991లో హైదరాబాద్‌కు చెందిన విజయలక్ష్మి కొనుగోలు చేశారు. మహేశ్వరం గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ శుకూర్, నగరంలోని చాంద్రాయన్‌గుట్టకు చెందిన సాబేర్ బిన్ మహ్మద్ కలిసి తప్పుడు పత్రాలు సృష్టించారు. విజయలక్ష్మి అనే మరో మహిళ పేరిట సృష్టించిన పత్రాలతో 2006లో శుకూర్ పేరిట ఐదెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2024 సెప్టెంబర్‌లో బాధితురాలు విజయలక్ష్మి ఆన్‌లైన్ చెక్‌చేసుకోవడంతో భూమి శుకూర్ పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుకూర్ వద్ద ఉన్న డాక్యుమెంట్ పత్రాల్లోని వేలి ముద్రలను ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టుకు పంపి ఫేక్ డాక్యుమెంట్‌గా తేల్చారు. శుక్రవారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు సాబేర్ బిన్ మహ్మద్‌ను రిమాండ్‌కు తరలించగా.. శుకూర్‌కు ముందస్తు బెయిల్ తెచ్చుకోవడంతో అరెస్ట్ చేయలేదు.

హక్కుల సాధనకు పోరాటం

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి

షాద్‌నగర్: దివ్యాంగుల హక్కుల సాధనకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) నిరంతరం పోరాడుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. సంఘం ఏర్పాటై 15 ఏళ్లు పూర్తైన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద సంఘం డివిజన్ అధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భుజంగరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, దివ్యాంగ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్, మనీలా, మురళీ, శ్రీను, నర్సమ్మ, సత్తయ్య, అంజయ్య, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న భుజంగరెడ్డి

చికిత్స పొందుతూ కండక్టర్ మృతి



అంజయ్య (ఫైల్)

యాచారం: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగంలో ఒత్తిడితో కృంగిన ఓ ఆర్టీసీ కండక్టర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. యాచారం అనుబంధ గ్రామం గాండ్లగూడెంకు చెందిన కొరే అంజయ్య(55) ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీనికి తోడు విధుల్లో ఉన్నతాధికారుల వేధింపులతో మనస్తాపం చెందిన అంజయ్య ఈ నెల 27న ఇంట్లోనే పురుగు మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భఋభార్య శోభ, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా అంజయ్య మృతదేహానికి నివాళి అర్పించేందుకు వచ్చిన ఆర్టీసీ అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల వేధింపుల వల్లే పురుగు మందు తాగాడని గ్రామస్తులు ఆరోపించారు. అంజయ్య కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అందరికీ అందుబాటులో పోలీసు సేవలు

రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కి వచ్చే వారందరికీ అందుబాటులో ఉంటూ, సమర్థవంతంగా పని చేసేందుకు కృషి చేస్తామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ని శుక్రవారం ఆయన నార్సింగి ఏసీపీ రమణ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం శంకర్‌పల్లి పట్టణంలో ఉన్న పీఎస్ శిథిలావస్థకు చేరిందని, దాని స్థలంలోనే కొత్తది నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరామని తెలిపారు. పాత భవనాన్ని కూల్చేందుకు ఇప్పటికే అనుమతి లభించిందని, త్వరలోనే దాన్ని కూల్చి వేసి ఏడాది లోపల కొత్త పోలీస్ స్టేషన్‌లో సేవలు ప్రారంభించేందుకు సన్నద్ధం అవుతున్నట్లు చెప్పారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఏసీపీ రమణ గౌడ్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలు, ఫంక్షన్ హాళ్లలో అనుమతి లేకుండా డీజేలు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్, మోకిల సీఐ వీరబాబు, డీఐ సమరంరెడ్డి, ఎస్‌ఐలు సుందరయ్య, బేతప్ప, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



లాకప్‌ని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

రేపు మహిళా జాబ్‌మేళా

ఆమనగల్లు: ఈ నెల 2న మహిళా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఈ మేళా ఉంటుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్య, ఉపాధి లక్ష్యాలుగా ఫౌండేషన్ పనిచేస్తోందని చెప్పారు. 3 వేల మంది మహిళలకు ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని తుక్కుగుడ సమీపంలో ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీల్లో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన మహిళలకు వేతనంతో పాటు ఉచిత బస్ సౌకర్యం, భోజన వసతి, బీమా, పీఎఫ్ సౌకర్యాలుంటాయన్నారు. పదవతరగతి, ఆపైన చదివిన మహిళలు 18 నుంచి 33 ఏళ్ల లోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివాలయంలో హుండీల చోరీ

అబ్దుల్లాపూర్‌మెట్: ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగులు రెండు హుండీలతో పాటు ఎల్‌ఈడీ లైట్‌ను అపహరించుకుపోయారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. అనాజ్‌పూర్ శివాలయంలోకి గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండుగులు ప్రవేశించి రెండు హుండీలు, ఒక ఎల్‌ఈడీ లైట్‌ను ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోటబాసుపల్లిలో చిరుత పులి పిల్ల

- డీహైడ్రేషన్‌తో అస్వస్థత
- చికిత్స అందిస్తుండగా మృత్యువాత
- అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారుల సూచన



అస్వస్థతకు గురై మృతి చెందిన చిరుత పులి పిల్ల

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామ శివారులో చిరుతపులి పిల్ల కలకలం రేగింది. కొన ఉపిరితో ఉన్న చిరుత పిల్లను చూసిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న వారు చికిత్స నిమిత్తం తాండూరులోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా చిరుత పిల్ల మరణించింది. పుట్టిన 48 గంటల్లో డీహైడ్రేషన్ కారణంగా అస్వస్థతకు గురై మృతి చెందిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవిసరస్వతి తెలిపారు. కర్ణాటక ప్రాంతాంలోని చించోళి పరిసర ప్రాంతాంలోని అడవి నుంచి చిరుతలు సంచరించే అవకాశం ఉందన్నారు. కోటబాస్పల్లితో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

- తీర్పు వెలువర్చిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు: భూ తగాదాలు, రాజకీయ కక్షలతో బీఆర్‌ఎస్ నాయకుడిని దారుణంగా హత్యచేసిన కేసులో నలుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు ఇచ్చారు. ఎస్పీ నారాయణ రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ధారూరు మండలం మైలారానికి చెందిన పెండ్యాల శ్రీనివాస్(38) వికారాబాద్‌లో నివాసం ఉండేవాడు. స్వగ్రామంలో పొలం పనులు చూసుకునేందుకు ఏప్రిల్ 22, 2018 రోజున హరిదాస్‌పల్లికి చెందిన వినోద్ కుమార్‌తో కలిసి మైలారానికి బయలుదేరారు. ఇదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దారికాచి మారణాయుధాలు, కర్రలతో శ్రీనివాస్‌ను హత్యచేశారు. వీరి నుంచి తప్పించుకున్న వినోద్‌కుమార్ మృతుడి భార్య యాదమ్మకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం హత్య చేసింది తామేనంటూ మైలారానికి చెందిన మద్దులపల్లి దాను, మద్దులపల్లి ప్రశాంత్‌కుమార్, మద్దులపల్లి అరుణ్‌కుమార్, మద్దులపల్లి భాస్కర్ గంటల వ్యవధిలోనే పీఎస్‌లో లొంగిపోయారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీ శిరీష, సీఐ ఉపేందర్, ఎస్‌హెచ్ఓ రాజు అన్ని సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. న్యాయస్థానంలో వాదోపవాదాలు విన్న జడ్జి హంతకులకు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నగదు చెల్లించని పక్షంలో నాలుగు నెలల సాధారణ శిక్ష అనుభవించాలన్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమరసింహారెడ్డి కేసును వాదించారని, ప్రస్తుత సీఐ రఘురాం, ఎస్‌ఐ అనిత కేసును పర్యవేక్షించారని ఎస్పీ వెల్లడించారు.